

వల్లూర్‌లో ముదిరాజ్‌ల
సామాజిక బహిష్కరణ
చెరువుల్లో మత్స్య సంపదపై హక్కులు ఇవ్వాలని..
వెలివేతకు గురైన దళిత
కుటుంబానికి రక్షణ కల్పించండి 7

స్టోన్‌క్రషర్ల అనుమతులు రద్దు చేయండి

అసైన్డ్ భూముల్లో క్రషర్ల ఏర్పాటుపై సీఎంను కలిసి ఫిర్యాదుచేసిన రాళ్లకత్వవాసులు



స్టోన్‌క్రషర్లపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసిన రాళ్లకత్వవాసులు

జిన్నారం, సెప్టెంబరు 21: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం రాళ్లకత్వలో అసైన్డ్ భూముల్లో స్టోన్‌క్రషర్ల ఏర్పాటును రద్దు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన పలువురు నాయకులు శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. రాళ్లకత్వ గ్రామపరిధిలోని సర్వే నంబర్ 286లోని అసైన్డ్ భూముల్లో నిబంధనలకు వ్యతిరేకంగా స్టోన్‌క్రషర్లు, క్వారీల ఏర్పాటు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. గతంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో క్రషర్లు వద్దని గ్రామస్థులంతా ముక్తకంఠంతో తీర్మానించినా అధికారులు పెడచెవిన పెడుతున్నారని తెలిపారు. అసైన్డ్‌భూముల్లో వ్యాపార కార్యకలాపాలు చేపడుతున్నారని ఆరోపించారు. స్టోన్‌క్రషర్లు ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో చెరువు, కుంటలు ఉన్నాయని పేర్కొన్నారు. నీటివనరులు, పంటపొలాలు, నివాసాలకు స్టోన్‌క్రషర్ల వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని వారు సీఎంతో మొరపెట్టుకున్నారు. రెవెన్యూ అధికారులకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్టోన్‌క్రషర్లకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని ముఖ్యమంత్రిని కోరామని, తమ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా విన్నారని నాయకులు తెలిపారు.



సింగిల్ సెంట్రల్ లైటింగ్‌తో అభివృద్ధి చెందనున్న సంగారెడ్డిలో అల్విన్ బైపాస్ రహదారి





మహర్దశ పట్టనున్న నేషనల్‌హైవే నుంచి కలివేముల రహదారి

జగ్గారెడ్డి కృషితో నిధులు మంజూరు

రెండు రోడ్లకు రూ.16.5 కోట్లు కేటాయింపు

సంగారెడ్డి వాహనదారులకు ప్రయోజనం

సంగారెడ్డి, సెప్టెంబర్ 21 : టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రత్యేక చొరవతో రెండు కీలకమైన రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. సంగారెడ్డిలోని అల్విన్ బైపాస్ రహదారిని సెంట్రల్ లైటింగ్‌తో విస్తరణ లేకుండా అభివృద్ధి చేయడానికి రూ. 12 కోట్లు విడుదల చేయించారు. రహదారి పక్కనున్న వ్యాపారులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఈ నిర్మాణం చేపట్టనున్నారు. ఇక నేషనల్ హైవే నుంచి భూలక్ష్మమ్మ మీదుగా కలివేముల రహదారికి రూ.4.50 కోట్లు కేటాయింపజేశారు. రహదారుల అభివృద్ధితో సంగారెడ్డి ప్రజలకు, వాహనదారులకు ప్రయోజనం కలగనుంది. కాగా, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఈ రెండు రహదారుల అభివృద్ధి కోసం ప్రతిపాదనలు పంపించానని జగ్గారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ నిధులను విడుదల చేయించానని తెలిపారు. వెంటనే పనులు ప్రారంభిస్తామని జగ్గారెడ్డి వివరించారు. నిధుల మంజూరు కోసం జగ్గారెడ్డి కృషిని స్థానికులు కొనియాడారు.

దంచికొట్టిన వాన

ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి జిల్లా దిగ్వాల్‌లో 9.8 సెం.మీ.లు

నారింజ వాగు ఉధృతికి మునిగిన పంటచేలు



నిండుగా పారుతున్న కోహీర్‌లోని నారింజ వాగు



నిండుకుండను తలపిస్తున్న నారింజ ప్రాజెక్టు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 21: ఉమ్మడి మెదక్ జిల్లాలో వర్షాలు మళ్లీ దంచికొడుతున్నాయి. పది రోజుల విరామం ఇచ్చిన వరుణుడు మళ్లీ ప్రతాపం చూపుతున్నాడు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలో శనివారం భారీ వర్షాలు కురిశాయి. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాష్ట్రంలోనే అత్యధికంగా సంగారెడ్డి జిల్లా దిగ్వాల్‌లో 9.8 సెం.మీ వర్షపాతం నమోదైంది. బంగాళఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దాని ప్రభావం జిల్లాపై ఉంటుందని వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో, రానున్న మూడు రోజుల పాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అంతేకాకుండా బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. గంటలకు 30-40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ప్రజలు అవసరమైతేనే బయటలకు వెళ్లాలని సూచించింది.

దిగ్వాల్‌లో కుండపోత

అత్యధికంగా సంగారెడ్డి జిల్లా దిగ్వాల్‌లో గంటపాటు కుండపోత కురిసింది. ఇక్కడ 9.8 సెం.మీ వర్షపాతం నమోదు కాగా.. అల్గోల్ 6.5సెం.మీ., మాల్చెల్మ 4.9సెం.మీ., కోహీర్ 4.4సెం.మీ., న్యాల్కల్ 3.5సెం.మీ., సత్వార్ 2.5 సెం.మీ., రాయికోడ్ 2.3సెం.మీ., జిన్నారం 1.7సెం.మీ., మెదక్ జిల్లాలో చిన్నశంకరంపేట 4.5సెం.మీ., దామరంచ 3.8సెం.మీ., ఇస్లాంపూర్ 3.6సెం.మీ., చిట్కుల్ 1.3సెం.మీ., సిద్దిపేట జిల్లాలో బేగంపేట 1.8సెం.మీ., బెజ్జంకి 1.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

దిగ్వాల్‌లో రికార్డుస్థాయి వర్షపాతం

కోహీర్, సెప్టెంబరు 21: మండలంలోని దిగ్వాల్ గ్రామంలో శనివారం సాయంత్రం గంట పాటు భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలోనే అత్యధికంగా 90.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల గణాంక అధికారి హేమలత తెలిపారు. కోహీర్‌తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు భారీ వర్షాలు కురిశాయి. నారింజ వాగు నిండుగా పారుతోంది. 10 రోజుల క్రితం వర్షాలకు నారింజ పరివాహక ప్రాంతంలోని పంటచేలు నీట మునిగాయి. ఇప్పుడిప్పుడే పంటలు కోలుకుంటుండగా మరోసారి వర్షాలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే, 65వ జాతీయ రహదారి నుంచి మండల కేంద్రమైన కోహీర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఈదురుగాలులకు చెట్టు విరిగి పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

నారింజ గేటు ఓపెన్

జహీరాబాద్, సెప్టెంబరు 21: భారీ వర్షానికి నారింజ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్‌లో ప్రారంభమైన వాగు 10 గ్రామాల మీదుగా కొత్తూర్(బి) వద్ద నిర్మించిన నారింజ ప్రాజెక్టుకు చేరుతుంది. జహీరాబాద్, కోహీర్ మండలాల్లో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి నారింజకు వరద ఉధృతి పెరిగింది. దీంతో, ఇరిగేషన్ డీఈఈ వెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రాజెక్టు గేటు ఎత్తి నీటిని కిందికి విడుదల చేశారు. ప్రాజెక్టుకు మొత్తం 7 గేట్లు ఉండగా.. ఒక గేటును ఎత్తారు. 3,122 క్యూసెక్కుల వరద వస్తుండగా మొత్తం కిందికి వదులుతున్నామని అధికారులు తెలిపారు. కాగా, ఈదురుగాలులకు ప్రాజెక్టు వద్ద బీదర్‌కు వెళ్లే రోడ్డుపై చెట్టు విరిగిపడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు, అధికారులు చేరుకుని చెట్టును తొలగించారు.



కోహీర్‌లో నారింజ వాగు ఉధృతికి నీట మునిగిన పంటలు



జహీరాబాద్ పట్టణంలో జలమయమైన బాబానగర్ కాలనీ



బీదర్ రోడ్డుపై విరిగిపడిన చెట్టు

నవంబరులో ప్రత్యేక ఓటరు క్యాంపులు

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 21: ప్రత్యేక ఓటరు క్యాంపులను నవంబరు 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్టు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ఓటరు జాబితా డ్రాఫ్ట్‌ను ప్రకటించనున్నామని, ఈ నెల 29 నుంచి నవంబరు 28 వరకు ఓటరు జాబితాలో అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. తుది ఓటరు జాబితా ప్రకటన కోసం బీఎల్‌వోలు ఇంటింటి సర్వేను 28లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రాఫ్ట్ రోల్ ప్రకటనలో తప్పులు లేకుండా జాబితా ప్రకటించేలా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. డ్రాఫ్ట్‌రోల్‌లో తప్పులు లేకుండా తుది ఓటరు జాబితా ప్రకటన సులువు అవుతుందని అన్నారు. నవంబరు 9, 10 తేదీల్లో బీఎల్‌వోలు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయనున్నారని, ఈ క్యాంపుల్లో 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారందరూ ఓటరుగా నమోదు చేసుకుని ఉండాలన్నారు. ఈ క్యాంపులో ఫారం 6, 7, 8 అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు మహిళా సంఘాల సభ్యులతో ఓటరు నమోదుపై విస్తృత సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

పెట్టుబడి పేరుతో మోసం

రూ. 14.84 లక్షలను కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

తూప్రాన్, సెప్టెంబరు 21: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో సైబర్ మోసం జరిగింది. అధిక లాభాలు వస్తాయని చెప్పిన మాటలు విని రూ.14.84 లక్షలు పెట్టుబడి పెట్టిన ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు కుచ్చుటోపీ పెట్టారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి అధికంగా డబ్బులు సంపాదించేందుకు గూగుల్‌లో సెర్చ్ చేశాడు. అతనికి జూలై 11న ఎస్‌ఎంసీ క్యాపిటల్ నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. అందులో పెట్టుబడి పెడితే అధికంగా లాభాలు పొందొచ్చంటూ సూచించారు. వారు చెప్పిన విధంగా 31న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, నెట్ బ్యాంకింగ్ నుంచి రూ.10,94,589లు పెట్టుబడి పెట్టాడు. ఈ నెల 17న డబ్బులు అవసరముండటంతో తీసుకోవాలని అడగగా, రూ.3,89,589లు చెల్లింపులు చేస్తే మొత్తం తిరిగి ఇస్తామంటూ సూచించారు. దాంతో ఆ డబ్బులు కూడా చెల్లించాడు. అయినా డబ్బులు చెల్లించకపోగా.. మరిన్ని డబ్బులు చెల్లించాలని అనడంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శివానందం వివరించారు.

తల్లిదండ్రుల ఏమరపాటు..

బస్సు దిగి తప్పిపోయిన బాలుడు

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 21 : తల్లిదండ్రులు ఏమరపాటుగా వ్యవహరించడంతో ఆర్టీసీ బస్సులో నుంచి ఓ బాలుడు దిగి తప్పిపోగా, ఆటో డ్రైవర్ సాయంతో పోలీసులు గుర్తించి తల్లిదండ్రులను పట్టుకుని అప్పగించిన సంఘటన శనివారం సిద్దిపేట పట్టణంలో చోటుచేసుకున్నది. కంట్రోల్‌రూమ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశంగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మహిళ తన కుమారుడు జెన్నర్‌తో కలిసి సిరిసిల్ల నుంచి సికింద్రాబాద్ వెళ్లేందుకు వేములవాడ డిపోకు చెందిన టీఎస్ 08 జెడ్ 0090 నంబర్ గల ఆర్టీసీ బస్‌లో ప్రయాణిస్తుంది. మార్గమధ్యలో మధ్యాహ్నం 3.30 గంటలకు సిద్దిపేట ఓల్డ్ బస్టాండ్ వద్ద బస్సు ఆగగానే పిల్లవాడు ఒక మహిళతో కిందికి దిగాడు. గమనించని తల్లిదండ్రులు బస్సులో వెళ్లిపోయారు. పిల్లవాడు ఆ మహిళ దగ్గర ఉండి ఏడుస్తుండగా, పక్కనే ఉన్న ఆటో డ్రైవర్ డయల్ 100కు కాల్ చేసి చెప్పారు. వెంటనే కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తమై ఆ మహిళ వద్ద ఉన్న టికెట్స్ ఆటో డ్రైవర్‌తో వాట్సాప్ చేయించుకున్నారు. టికెట్‌పై ఉన్న నంబర్‌కు ఫోన్ చేయగా వేములవాడ డిపో మేనేజర్ ఫోన్ లిఫ్ట్ చేసి బస్సు నంబర్ చెప్పారు. బస్సు కండక్టర్ మొబైల్ ఫోన్ నంబర్ ఇచ్చాడు. కంట్రోల్ రూమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ భిక్షపతి, వెంటనే కండక్టర్‌కు ఫోన్ చేసి బాబు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు వెంటనే సిద్దిపేటకు తిరిగి పయనమయ్యారు. వారు ఓల్డ్ బస్టాండ్ వద్దకు రాగానే పోలీసులు పూర్తి విచారణ జరిపి అబ్బాయిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమారుడిని క్షేమంగా అప్పగించినందుకు పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ కంట్రోల్ రూమ్ సిబ్బందిని అభినందించారు. త్వరలో రివార్డ్ అందజేస్తామని తెలిపారు.

విలీన గ్రామాల్లో.. నిలిచిన రిజిస్ట్రేషన్లు

అయిదు రోజులుగా ఇదే పరిస్థితి

పోర్టల్‌ను అప్‌డేట్ చేయని ఐటీ శాఖ

సర్వర్ డౌన్ అంటున్న సబ్-రిజిస్ట్రార్లు

మేడ్చల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో.. మునిసిపాలిటీల్లో విలీనమైన గ్రామాలకు చెందిన ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. డీడీలు చెల్లించి, ప్లాట్లు బుక్ చేసుకున్న కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ల కోసం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ.. రిక్తహస్తాలతో వెనక్కి మళ్లుతున్నారు. ముఖ్యంగా హెచ్‌ఎండీఏ లేఅవుట్లు అధికంగా ఉన్న గ్రామాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. జిల్లాలో.. 28 గ్రామాలను సమీప మునిసిపాలిటీల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే.! ఈ మేరకు ఐటీ శాఖ పరిపాలన పరమైన అన్ని శాఖల వెబ్‌సైట్లను అప్‌డేట్ చేస్తుంది. అయితే.. రాష్ట్ర ఖజానాకు కీలక ఆదాయ వనరుల్లో ఒకటైన రిజిస్ట్రేషన్ల శాఖ విషయంలో మెతకవైఖరి అవలంబిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సబ్-రిజిస్ట్రార్లకు స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో.. కొన్ని వందల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా.. విలీన గ్రామాల వివరాలను రిజిస్ట్రేషన్ల శాఖ పోర్టల్‌లో అప్‌డేట్ చేయలేదని సమాచారం. డీడీల చెల్లింపు, స్లాట్ బుకింగ్ ప్రక్రియలు యథావిధిగా సాగుతున్నా.. రిజిస్ట్రేషన్ విషయంలో 'సర్వర్ ఎర్రర్'గా చూపుతోందని సబ్-రిజిస్ట్రార్లు చెబుతున్నారు. పోర్టల్‌లో మార్పులు చేయాల్సి ఉన్నందునే.. రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఉన్నతాధికారులు వివరిస్తున్నారు. ఐదు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని జిల్లా రిజిస్ట్రార్ చెబుతున్నారు.



దిక్కుతోచని స్థితిలో రియల్టర్లు

విలీన గ్రామాలు రింగ్‌రోడ్డు పరిసరాల్లో ఉన్నందున ఈ గ్రామాల్లో పెద్ద ఎత్తున హెచ్‌ఎండీఏ వెంచర్లు ఉన్నాయి. ఈ వెంచర్లకు సంబంధించి.. కొనుగోలుదారులకు ఇచ్చిన హామీ ప్రకారం ప్లాట్ల రిజిస్ట్రేషన్లు కాక పోవటంతో రియల్టర్లు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఘట్‌కేసర్, కీసర, శామీర్‌పేట, మేడ్చల్ ఎస్‌ఆర్‌వో పరిధిలో ఐదు రోజులుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో.. రియల్టర్లు తలలు పట్టుకుంటున్నారు. కనీసం రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఎప్పుడు పునరుద్ధరిస్తారనేదానిపై సబ్-రిజిస్ట్రార్ల వద్ద కూడా సమాచారం లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.





ఘనంగా విశ్వకర్మ రథోత్సవం

మద్విరాట్ విశ్వకర్మ జయంతి యజ్ఞంలో భాగంగా శనివారం రాత్రి సంగారెడ్డిలో విశ్వకర్మ రథోత్సవం ఘనంగా జరిగింది. సంగారెడ్డి చౌరస్తా నుంచి ప్రారంభమైన ఈ రథోత్సవం పాత బస్టాండ్, కింది బజార్ వరకు కొనసాగింది. డీజే సౌండ్ ఎదుట కళాకారుల నృత్యాలు అలరించాయి. మహిళల కోలాటం ఎంతో ఆకట్టుకుంది. అంతకుముందు ఉదయం 7.30 గంటలకు కలశ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వి.అశోక్‌చారి, ఉపాధ్యక్షుడు వి.బ్రహ్మంచారి, నాయకులు పాల్గొన్నారు.

-సంగారెడ్డి రూరల్



పౌష్టికాహారంతోనే ఆరోగ్యం: సీడీపీవో సుజాత

నాగల్‌గిద్ద, సెప్టెంబరు 21: పౌష్టికాహారంతోనే బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో సుజాత అన్నారు. శనివారం మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలతో పాటు పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. దీంతోపాటు అంగన్‌వాడీ కేంద్రంలో ఇస్తున్న బాలామృతం, పలు రకాల వంటలు చేసుకోవచ్చన్నారు.













మైనర్లకు వాహనాలిస్తే కేసు

● సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ


సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 21: మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా ప్రజలకు సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ సూచించారు. మైనర్ డ్రైవింగ్ వల్ల ఎంతోమంది పిల్లలు చనిపోవడం, క్షతగాత్రులుగా మిగలడం జరుగుతుందన్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న పిల్లలను ఎంతో కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని చెప్పారు. మైనర్ డ్రైవింగ్ వల్ల సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ పట్టణాల్లో, గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది క్షతగాత్రులయ్యాయని తెలిపారు. మైనర్ డ్రైవింగ్ చేసేవారి, వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఏడాది మైనర్ డ్రైవింగ్ చేసేవారిపై 798 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మైనర్ డ్రైవింగ్, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు గురించి సిద్దిపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ ట్రాఫిక్ సిబ్బంది, స్కూళ్లలో, కాలేజీల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, మైనర్ డ్రైవింగ్ వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

టేక్మాల్, సెప్టెంబరు 21: జీవితంపై విరక్తితో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఎస్‌ఐ రాజేష్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సింగూరి మహేశ్వరి(26)కు సింగూరి రమేష్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఒక సంవత్సరం బాగానే ఉన్నారు. తర్వాత రమేష్ మద్యానికి బానిసగా మారాడు. తాగొద్దని భార్య ఎంత చెప్పినా వినకపోవడంతో మనస్తాపానికి గురైంది. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉన్న యాసిడ్‌ను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న మహేశ్వరి తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మహేశ్వరి కోలుకోవడంతో తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. మహేశ్వరి అనారోగ్యంతో ఉండడంతో చికిత్స చేయించేందుకు ఉస్మానియా ఆసుపత్రికి ఈనెల 18న తీసుకవెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొత్తపల్లిలో వ్యక్తి అదృశ్యం


మహేష్‌గౌడ్(ఫైల్)

గుమ్మడిదల సెప్టెంబరు 21: వ్యక్తి అదృశ్యమైన సంఘటన గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డమీది మహేష్(3) ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ రావడంతో భార్య మాధురి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పొలం దగ్గరికి వెళ్లిన మహిళ...


నాగమణి(ఫైల్)

శివ్వంపేట, సెప్టెంబరు 21: మతిస్థిమితం లేని మహిళ పొలం దగ్గరికి అని వెళ్లి అదృశ్యమైంది. ఈ సంఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో శనివారం చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. శివ్వంపేట గ్రామానికి చెందిన లస్కరి నాగమణి(30) ఈనెల 18న ఉదయం 5 గంటలకు పొలం దగ్గరికి వెళ్లింది. రాత్రి 8 గంటలకు నాగమణి భర్త లస్కరి నర్సింహులు ఇంటికొచ్చి చూడగా.. నాగమణి కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

బోరు మోటారు దొంగల అప్పగింత


మోటార్, పైపు కేబుల్‌ను పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

శివ్వంపేట, సెప్టెంబరు 21: బోరు మోటార్‌ను దొంగిలించిన వ్యక్తులను గ్రామస్థులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గుండ్లపల్లిలో శనివారం చోటు చేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కిషన్‌రావు పొలంలో గురువారం అర్ధరాత్రి బోరు బావిలో నుంచి మోటారు, పైపు, కేబుల్ వైర్‌ను ట్రాక్టర్‌లో అపహరించుకుపోయి రహస్య స్థలంలో పెట్టారు. శనివారం దానిని గుర్తించిన గ్రామస్థులు దొంగతనానికి పాల్పడిన గ్రామానికి చెందిన మస్కూరి స్వామి, మస్కూరి శేఖర్, గంపల విక్రమ్‌తో పాటు ట్రాక్టర్‌ను పోలీసులకు అప్పగించారు.





మోర్గి వంతెన పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నారాయణఖేడ్, సెప్టెంబరు 21: మోర్గి వంతెనపై అసంపూర్తి పనులు నిత్యం అవస్థలు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో గత నెల 11న ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం పంచాయతీ రాజ్ ఎస్ఈ జగదీశ్వర్, ఈఈ అంజయ్య ఆ వంతెనను పరిశీలించారు. నారాయణఖేడ్, బీదర్‌ల మధ్య అంతర్ రాష్ట్ర రహదారిపై మోర్గి సమీపంలో రూ.820 కోట్లతో చేపట్టిన వంతెన పనులను దక్షాఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థ అసంపూర్తిగా వదిలివేసింది. ఏడు పిల్లర్లతో చేపట్టిన ఈ పనులను పరిశీలించిన అధికారులు, నాణ్యతారహితంగా ఉన్న వాటిని తొలగించి తిరిగి పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వారి వెంట డిప్యూటీ ఈఈ దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జైలు సూపరింటెండెంట్

● తొలిసారిగా ఎస్పీ స్థాయి అధికారి


సంతోష్‌కుమార్ రాయ్

కంది, సెప్టెంబరు 21 : కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబద్‌లోని చర్లపల్లి సెంట్రల్ జైలు నుంచి ఆయన బదిలీపై సంగారెడ్డికి వచ్చారు. ఈ సందర్భంగా జైలు అధికారులు, సిబ్బంది సంతోష్‌కుమార్‌రాయ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంగారెడ్డి జిల్లా జైలును 2023 జనవరిలో సెంట్రల్ జైలుగా ప్రకటించిన తర్వాత డీఎస్పీ స్థాయి అధికారులే సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు. ఇప్పుడు తొలిసారిగా ఎస్పీ స్థాయి అధికారి జైలు పర్యవేక్షణ అధికారిగా పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ రాయ్ మాట్లాడుతూ జైళ్లశాఖ ప్రవేశపెట్టిన సంస్కరణల అభివృద్ధికి తోడ్పాటునందిస్తానన్నారు. పరివర్తన కార్యక్రమాల ద్వారా ఖైదీల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు.

'యువజనోత్సవాల' పోటీలకు దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 21 : సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో ఈ నెల 27న జిల్లా యువజనోత్సవాలు, సైన్స్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఖాసీంబేగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జానపద నృత్యం(గ్రూప్), సోలో, జానపద గీతం(గ్రూప్), సోలో, స్టోరీ రైటింగ్, కవితలు, పెయింటింగ్ తదితర పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు ఉన్న జిల్లా వాసులు కలెక్టరేట్‌లోని జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులు ఈ నెల 25వ తేదీలోగా సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7386191141, 8431639907 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రేపు జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 21 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న సంగారెడ్డిలోని జుబ్లీ క్లబ్ ప్రాంగణంలోని ఎం.ఎస్. అకాడమీలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు క్రికెట్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఎ.రాజేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 నుంచి వరంగల్‌లో జరిగే అండర్-19 అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులు 1.9.2005 నుంచి 31.08.2008 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, బోనాఫైడ్‌తో ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని పేర్కొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి


అంతర్గాం శివారులో మృతిచెందిన ఎద్దు

కల్హేర్, సెప్టెంబరు 21 : సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం శివారులో పిడుగుపడి ఎద్దు మృతిచెందింది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన గైని అంజయ్య శనివారం తన ఎద్దును పంట పొలాల వద్ద ఉన్న చెట్టు కింద కట్టేసి పొలం పనులు చేసుకుంటున్నాడు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో ఆ చెట్టుపై పిడుగు పడటంతో ఎద్దు మృతిచెందింది. పేద రైతు అంజయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ రవిపటేల్, గ్రామస్థులు కోరారు.

● **పాపన్నపేట** : పాపన్నపేటలోని పాతూరులో శనివారం సాయంత్రం పిడుగు పడింది. రాముని పాదాల వద్ద ఉన్న వేప చెట్టుపై పిడుగు పడగా కొమ్మ విరిగి కింద పడింది. ఎలాంటి ప్రాణనష్టమూ సంభవించలేదు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 21: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన పెద్ద శంకరంపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పేటలోని వడ్డెరవాడకు చెందిన ఎల్లోయి కుమార్(38) శనివారం భార్యతో గొడవపడ్డాడు. దీంతో క్షణికావేశంలో తన కాలనీలోకి వెళ్లే మార్గంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ శంకర్ ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడిని హైవే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వివరాలు సేకరించాడు. కాగా, బాధితుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.


వివరాలు సేకరిస్తున్న పేట ఎస్ఐ శంకర్

నీటిశుద్ధి కేంద్రానికి మోక్షమెప్పుడో..?


నిరుపయోగంగా నీటి శుద్ధి కేంద్రం

● కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని గ్రామ వాటర్ ప్లాంట్
● కొడకండ్లలో తాగునీటి తండ్లాట
● ప్రైవేటు తాగునీటి శుద్ధి కేంద్రాలతో ప్రజల జేబులకు చిల్లు..

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 21: సుమారుగా 3000 జనాభా గల గ్రామం తాగునీటి సమస్యతో తండ్లాడుతున్నది. గ్రామానికి కూతవేటు దూరంలో కొండపాకలో మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రం ఉన్నప్పటికీ నిత్యం కొడకండ్ల గ్రామస్థులకు తాగునీటిగోస తప్పడంలేదు. గ్రామంలో నీటిశుద్ధి కేంద్రం శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా మారడంతో సమస్య మరింత జటిలమైంది. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు వాటర్ ప్లాంట్స్‌వారు చేతికి అందినకాడికి దండుకుంటున్నారు. అయినా గ్రామ నీటిగోసను పాలకవర్గం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

గ్రామంలోని వాటర్‌ప్లాంట్ శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారినా ప్రజాప్రతినిధులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. గజ్వేల్ మండలంలోని జనాభా ప్రాతిపదికన ఉన్న పెద్ద గ్రామాల్లో కొడకండ్ల గ్రామం కూడా ఒకటి. ఇది పారిశ్రామిక ప్రాంతం కావడంతో దాతల సహాయంతో గ్రామంలో పదేండ్ల క్రితం నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గతంలో గ్రామ పంచాయతీ బాధ్యత తీసుకొని, గ్రామసభ ఏర్పాటు చేసి బహిరంగంగా వేలం వేసి నీటిశుద్ధి కేంద్రం నిర్వహణ బాధ్యతను అప్పగించేది. వేలంలో వచ్చిన డబ్బును విడతల వారీగా వసూలు చేస్తూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేసేది. దీంతో చుట్టు పక్కల గ్రామాలైన రిమ్మనగూడ, రాయవరం, తిమ్మాపూర్, పిటివెంకటాపూర్, రామచంద్రపూర్ గ్రామాల ప్రజలకు తాగునీటికి ఢోకా ఉండకపోయేంది. అనంతరం పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మరమ్మతులకు నోచుకోక తాగునీటి శుద్ధి కేంద్రం నిరుపయోగంగా మారింది. గత మూడు సంవత్సరాలుగా దాన్ని పట్టించుకునే నాథుడేలేడు. స్థానిక పరిశ్రమలు ఇస్తున్న నిధులు ఎటు పోతున్నాయో తెలియని పరిస్థితి. ఇదిలా ఉండగా గ్రామంలో ఏకంగా మూడు ప్రైవేటు తాగునీటి శుద్ధి కేంద్రాలు పుట్టుకరాగా, తప్పని పరిస్థితుల్లో నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. ప్రభుత్వ అధికారులు, పాలకవర్గం ఇకనైనా మేల్కొని గ్రామంలో నీటిశుద్ధి కేంద్రాన్ని ఉపయోగంలోకి తెచ్చి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామప్రజలు కోరుతున్నారు.



నీటిని కొనలేకపోతున్నాం : కర్నాల గణేష్, కొడకండ్ల గ్రామస్థుడు

గతంలో రూ.5కే 20 లీటర్ల నీరు లభించేది. ఇతర గ్రామాలవారు కూడా ఇక్కడి నుంచి నీటిని తీసుకెళ్లేవారు. వేలం పాటలో దక్కించుకున్నవారికి ఉపాధి కూడా లభించేది. కొన్నేళ్లుగా గ్రామంలోని వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. అప్పటి నుంచి దాన్ని పట్టించుకునేవారేలేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్‌ప్లాంటును ఉపయోగంలోకి తేవాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ప్రకృతివనం ఎదుట పిచ్చిమొక్కల తొలగింపు

శివ్వంపేట, సెప్టెంబరు 21 : బృహత్ పల్లె ప్రకృతి వనం నిర్వహణ గాలికి వదిలేయడంతో ప్రకృతి వనం.. వికృతరూపం అనే శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో గ్రామ ప్రత్యేక అధికారి నాగేశ్వర్ స్పందించారు. ఈ మేరకు శనివారం మండల పరిధిలోని గోమారం బృహత్ పల్లె ప్రకృతి వనం ఎదుట పెరిగిన పిచ్చి మొక్కలను ఎన్నిమిది మంది పంచాయతీ సిబ్బందితో తొలగింపజేశారు. ప్రకృతి వనంలోలప మొక్కల రక్షణకూ అవసరమైన చర్యలు చేపట్టారు.

తెలంగాణ సాయుధపోరాటంలో చాకలి ఐలమ్మ పాత్ర మరువలేనిది

● కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్


ఐలమ్మ కాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు శ్వేత, కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు/పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 21: తెలంగాణ సాయుధ పోరాటంలో వీర వనిత చాకలి ఐలమ్మ పాత్ర మరువలేనిదని, వారి కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని కాంగ్రెస్ నాయకుడు నీలంమధుముదిరాజ్ అన్నారు. ఐలమ్మ మునిమనవరాలు, ఇటీవల రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా ఎన్నికైన శ్వేత శనివారం పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో కాంగ్రెస్ నాయకుడు నీలంమధుముదిరాజ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్, నాయకులు చాకలి వెంకటేశ్, విష్ణువర్ధన్ రెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్, మురళి, అంజనేయులు, రజక సంఘం రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, కృష్ణ, నర్సింహులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా ఎన్నికైనందుకు శ్వేతను నీలం మధుముదిరాజ్ సన్మానించారు. కోటిలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడంతోపాటు ఆమె మునిమనుమరాలు శ్వేతకి మహిళా కమిషన్ సభ్యురాలుగా అవకాశం ఇవ్వడంపై నీలం మధు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా చిట్కుల్ ఎన్ఎంఆర్ కార్యాలయంలో శనివారం బాపూజీ చిత్రపటానికి కాంగ్రెస్‌నేత నీలం మధు ముదిరాజ్ నివాళులర్పించారు.

వల్లూర్‌లో ముదిరాజ్‌ల సామాజిక బహిష్కరణ

చేగుంట, సెప్టెంబరు 21: మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూర్ గ్రామంలో ముదిరాజ్ కులస్థులను ఇతర కులస్థులు సామాజిక బహిష్కరణ చేశారు. గత 20 రోజులుగా అన్నికులాల వారు ముదిరాజ్ కులస్థులను ఎలాంటి పనులకు రాకుండా బహిష్కరించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కుల సంఘం నాయకులు మాట్లాడుతూ అన్ని కులాలకు వారివారి కులవృత్తులు ఉండగా.. ముదిరాజ్‌లకు గత ప్రభుత్వం చెరువులు, కుంటల్లోని మత్స్య సంపదపై హక్కులు కల్పించిందని చెప్పారు. గ్రామంలోని చెరువులు, కుంటలకు సంబంధించిన సొసైటీలు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ అనుమతులు కూడా పొందామని, అయితే కావాలని వల్లూర్‌లోని ఇతర కులాల వారు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులోని మత్స్య సంపదపై వాటా ఇవ్వాలని డిమాండ్ చేయగా.. తాము నిరాకరించడంతో అందరూ కలిసి ముదిరాజ్ కులస్థులను సామాజిక బహిష్కరణ చేయడం ఎంతవరకు సమంజసమని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులు చొరవ తీసుకుని ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు నర్సింహులు, గణేష్, అంజనేయులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.


ప్రభుత్వ అనుమతి పొందిన పత్రాలు చూపిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

భారత సమ్మిళితాభివృద్ధికి మనవంతు చేయూతనిద్దాం

● వివిధ రంగాల నిపుణులు, ప్రముఖులు


కార్యక్రమంలో వక్తలు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 21 : సమగ్ర విధానాలతో దేశ సమ్మిళితాభివృద్ధికి చేయూతనిద్దామని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ద్వైవార్షిక కొలాక్విలో భాగంగా శనివారం భారతదేశం కోసం సమగ్ర విధానాలు అనే అంశంపై ముఖాముఖి చర్చలను నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రభుత్వ ప్రభుత్వేతర నిపుణులు, ఉన్నతాధికారులు పాల్గొని ఆయా అంశాలపై తమదైన శైలిలో పరిష్కార మార్గాలు చూపడంతో పాటు పలు సూచనలు చేశారు. ఆర్థిక రంగ భవిష్యత్తుపై చర్చలో డాక్టర్ రతిన్‌రాయ్, చేజ్ ఇండియా ఉపాధ్యక్షుడు కౌశల్ మహన్, ఐఆర్ఎస్ పూర్వ అధికారి షర్మిలా చావలీ పాల్గొన్నారు. పబ్లిక్ పాలసీలో మహిళలు అనే అంశంపై వీహబ్ అసోసియేట్ డైరెక్టర్ శాంతలా వీగాస్, తెలంగాణ ప్రభుత్వ పూర్వ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంత, హెర్టీ స్కూల్ ప్రొఫెసర్ డాక్టర్ ముజాహిద్ షేక్ పాల్గొన్నారు. డిజిటల్ గవర్నెన్స్ చర్చలో రేజర్‌పే ఇండియా డైరెక్టర్ శరణ్య గోపీనాథ్, డెలాయిట్ సీఈవో సుదీర్ఘ నీరసినేని, నాస్కామ్ ఫౌండేషన్ డైరెక్టర్ విక్రమ్ పాటిల్, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ పాల్గొన్నారు. వాతావరణ మార్పులపై చర్చలో అశోక్ లేలాండ్ కార్పొరేట్ స్ట్రాటజీ హెడ్ అలోక్ వర్మ, సంబోధి డిప్యూటీ ఉపాధ్యక్షుడు అభిషేక్ శర్మ, గ్రాంట్ థార్న్‌టన్ భారత్ ఎల్ఎల్‌పీ డైరెక్టర్ మోహన్ కుమార్ పాల్గొన్నారు. అప్పటికే ఆయా అంశాలపై పత్ర సమర్పణ చేసిన విద్యార్థులు నిపుణుల అభిప్రాయాలను ఆసాంతం ఆలకించడంతో పాటు పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కౌటిల్యా స్కూల్ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఈవోల సమస్యలు పరిష్కరించండి

● డీఏవోకు వినతిపత్రం


డీఏవో రాధికకు వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 21: ఏఈవోలుగా తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నామని, తమ సమస్యలను పరిష్కరించాలని ఏఈవోలు కోరారు. ఈ మేరకు శనివారం డీఏవో రాధికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ రైతుబంధు, రైతుబీమా, పీఎంకిసాన్, పంటల నమోదు, రుణమాఫీ, పంట నష్టం అంచనా, పంట కోత ప్రయోగాలు తదితర పనులతో నిత్యం తీరిక లేకుండా సతమతమవుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేయడానికి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక సహాయకుడు గానీ, 1000 ఎకరాలు లేదా 500 మంది రైతులకు ఒక సహాయకుడుగానీ ఉండేలా నియామకం చేపట్టాలని కోరారు. రైతు వేదికల్లో అసాంఘిక కార్యక్రమాల నివారణకు వాచ్‌మెన్, సమావేశాల సమయంలో సహాయకుడిగా ఒక అటెండర్‌లను నియమించాలన్నారు. పదోన్నతి అవకాశం కల్పించాలని కోరారు.

ఖైదీలకు నాణ్యమైన భోజనం అందించాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్


సంగారెడ్డి సెంట్రల్ జైలులో వంటలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

కంది, సెప్టెంబరు 21 : ఖైదీలకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బిరమేశ్ అన్నారు. శనివారం సంగారెడ్డి సెంట్రల్ జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని బ్లాకులు, ఖైదీల బ్యారక్‌లు, గదులు, వంటశాలలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో ఆయన మాట్లాడుతూ సమయానికి బెయిల్స్, ములాఖత్ అందుతున్నాయా అని ఆరా తీశారు. కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయవాదులు లేనివారు జిల్లా న్యాయసేవాధికార సంస్థలో అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఖైదీలు ఉచిత న్యాయసేవలు పొందేందుకు వారి తరఫున న్యాయవాదులను నియమిస్తామన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో జడ్జీలు, కోర్టు సిబ్బంది, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వందపడకలతో గుమ్మడిదల ప్రభుత్వ ఆసుపత్రి

● ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్
● స్థల సేకరణకు సర్వే షురూ..


ఆసుపత్రిని సందర్శించిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి

గుమ్మడిదల, సెప్టెంబరు 21 : వంద పడకల ఆసుపత్రి దిశగా గుమ్మడిదల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం అడుగులు వేస్తుంది. గుమ్మడిదల మండలం నాయకులు శుక్రవారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి మండలంలోని హాస్పటల్ సంబంధించిన సమస్యను వివరించగా సానుకూలంగా స్పందించారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు శనివారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రిదేవితో కలిసి ఆ కేంద్రాన్ని సందర్శించి స్థల పరిశీలన చేశారు. యుద్ధ ప్రాతిపదికన భూమి సేకరణకు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలు సంభవిస్తే వారికి వైద్య సేవలు అందించేందుకు వీలుగా గుమ్మడిదల ఆరోగ్య కేంద్ర స్థాయిని పెంచే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ముఖ్యంగా అత్యవసర వైద్య సేవాకేంద్రం(ట్రామ), 30 లేదా 50 పడకలు, ముందు చూపుగా 100 పడకలు ఆసుపత్రిని ఆధునీకరించడం కోసం అధికారులు, నాయకులతో చర్చించారు. ఆదివారం సంగారెడ్డి కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో పూర్తి నివేదికపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, జిల్లా ఇంజనీర్ రవీందర్, మండల తహసీల్దార్ గంగాభవాని, మండల అభివృద్ధి అధికారి డి.ఉమాదేవి, వైద్యాధికారి డా.మధుకర్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

తండ్రి వైద్యానికి చేసిన అప్పు తీర్చలేక ఆత్మహత్య

నర్సాపూర్, సెప్టెంబరు 21: అప్పు తీర్చే మార్గం లేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ పంచాయతీ పరిధిలోని అర్జున్‌తండాలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన హాళావత్ శ్రీనివాస్(41) రైతు. తన తండ్రి లచ్చయ్య ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆసుపత్రుల కోసం దాదాపు రూ.4లక్షల వరకు అప్పులు చేశాడు. ఆ అప్పు ఎలా తీర్చాలని మనోవేదనకు గురవుతున్నాడు. కాగా, శనివారం తెల్లవారుజామున బహిర్భూమికని వెళ్లి ఎంతసేపటికి తిరిగిరాలేదు. చుట్టుపక్కల వెతకగా ఇంటి వెనుకాల చెట్టుకు శ్రీనివాస్ మృతదేహం వేలాడుతూ కనిపించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

వెలివేతకు గురైన దళిత కుటుంబానికి రక్షణ

● మెదక్ జిల్లా అధికారులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజిగూడానికి చెందిన పంచమి చంద్రం (33) ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేసి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. గ్రామంలోని సామాజిక ఆచారాల ప్రకారం డప్పు కొట్టడం లేదంటూ అతడి కుటుంబంపై సామాజిక బహిష్కరణ చేయాలని గ్రామస్థులు కొందరు లిఖితపూర్వకంగా తీర్మానం చేశారు. గ్రామంలో ఎవరూ సహకరించకపోవడంతో మనస్తాపం చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదై ఐదురోజులు గడుస్తున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్ రెడ్డి విచారణ చేపట్టారు. దీంతో కోర్టు బాధిత కుటుంబానికి భరోసా ఇవ్వాలని ఎస్పీ, కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ అక్టోబర్ 18కి వాయిదా వేసింది.

అభాగ్యురాలికి అండగా యువత

చేగుంట, సెప్టెంబరు 21: ఇటీవల భారీ వర్షాలకు ఇల్లు కూలి రోడ్డున పడ్డ అభాగ్యురాలికి గ్రామ యువత అండగా నిలిచింది. నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి ఇల్లు కూలిపోగా పాఠశాలలో పునరావాసం పొందుతున్నది. ఆమె దివ్యాంగురాలుకాగా భర్త ఇదివరకే చనిపోయారు. ఉన్న ఇద్దరు కుమారులు మానసిక వైకల్యంతో బాధపడుతున్నారు. దీంతో గ్రామ యువత ముందుకు వచ్చి ఆమెకు దాతల సహకారంతో నూతన ఇల్లు నిర్మించగా.. శనివారం గృహ ప్రవేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, సత్యనారాణ, జనార్దన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


భాగ్యలక్ష్మి ఇంటి వద్ద గ్రామస్థులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

అల్లాదుర్గం, సెప్టెంబరు 21: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందని సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం టేక్మాల్ మండలానికి చెందిన మహ్మద్ ఖమర్ (52), అరవింద్‌తో కలసి పెద్దశంకరంపేటకు బైకుపై వెళ్లి శనివారం తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ముప్పారం శివారులోని 161వ జాతీయ రహదారి బ్రిడ్జిపై ముందు వెళ్తున్న ఆటోను బైకు ఢీకొట్టింది. దీంతో ఖమర్ తీవ్రగాయాలు కాగా, అరవింద్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరిని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఖమర్ చికిత్సపొందుతు మృతి చెందాడు. మృతుడి భార్య షరీనాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ఖమర్ (ఫైల్)

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు

● తృటిలో తప్పిన ప్రమాదం




కొండపాక, సెప్టెంబరు 21 : కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టడంతో తృటిలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్లితే శనివారం హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు అతివేగంగా వెళుతూ అదుపుతప్పి తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారి పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీ కొట్టింది. దాంతో చెట్టు విరిగి రోడ్డు పక్కన నిలిచి ఉన్న కారుపై పడగా ధ్వంసమైంది. ఈ ఘటనకు దగ్గరలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నది. అదృష్టవశాత్తు చెట్టుకు ఢీకొట్టి కారు ఆగిపోయింది. లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్‌సివిల్ జడ్జి సూరీక్రిష్ణ

జహీరాబాద్, సెప్టెంబరు 21: కోర్టుల ఆధ్వర్యంలో నిర్వహించే లోక్‌అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సూరీక్రిష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేలా కక్షి దారులకు అవగాహన కల్పించాలన్నారు. రాజీమార్గంద్వార కేసులను పరిష్కరించుకోవడం వల్ల విలువైన సమయం, డబ్బుని ఆదా చేసుకోవచ్చన్నారు.బ్యాంకు ఖాతాదారులందరూ లోక్‌ఆదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

సూరారం పెద్ద చెరువు బుంగ పూడ్చివేత

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 21: మండలంలోని సూరారం పెద్ద చెరువుకు పెద్ద బుంగపడి ప్రమాదంగా మారింది. గ్రామస్తుల ద్వారా సమాచారమందుకున్న అధికారులు తహసీల్దార్ మన్నన్, ఎస్ఐ నారాయణగౌడ్ శనివారం బుంగను పూడ్చేందుకు చర్యలు చేపట్టారు.

తెలంగాణ ఉద్యమంలో కొండాలక్ష్మణ్ సేవలు ఎనలేనివి

స్వాతంత్ర్యసమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్‌బాపు వర్ధంతి కార్యక్రమాలను సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. పలు సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో కొండాలక్ష్మణ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన సేవలు ఎనలేనివని పలువురు కొనియాడారు.


సంగారెడ్డిలో కొండాలక్ష్మణ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఫోరం ఫర్ బెటర్ నాయకులు


పటాన్‌చెరు: కొండాలక్ష్మన్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి

సంగారెడ్డి రూరల్/పటాన్‌చెరు/నారాయణఖేడ్/కౌడిపల్లి, సెప్టెంబరు 21: కొండా లక్ష్మణ్‌బాపు వర్ధంతిని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని కొండాలక్ష్మణ్ విగ్రహానికి శనివారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపు సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఫోరం ఉపాధ్యక్షుడు సజ్జద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్, సహకార్యదర్శి పాండురంగం, శ్రీకాంత్, సాయి పాల్గొన్నారు. పటాన్‌చెరులోని కొండాలక్ష్మణ్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయన త్యాగం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. నారాయణఖేడ్ మార్కండేయ భవన్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండాలక్ష్మణ్ బాపూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌడిపల్లి మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘం స్థల ఆవరణలో కొండాలక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పద్మశాలీల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు పిస్కే నర్సింహులు, జిల్లా యువత నాయకులు సంబారపు తిరుమలేష్, పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుకూలంగా బస్సులు నడిపించాలి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 21: విద్యార్థులకు సరైన సమయంలో ఆర్టీసీ బస్సులు నడపడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్ ఆరోపించారు. సంగారెడ్డిలోని డీఎం ఆఫీస్ ఎదుట విద్యార్థులతో కలిసి శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు సమయానికి బస్సులు రాకపోవడంతో సకాలంలో పాఠశాల, కళాశాలలకు చేరలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొండాపూర్ మండలం మల్లెపల్లి, మల్కాపూర్, గొల్లపల్లి, గుంతపల్లి, మునిదేవునిపల్లి మీదుగా షైతాఫ్‌ఖాన్‌గూడ వరకు బస్సు ఒక్కటే ఉన్నదని, దాదాపు 200 మంది ఎక్కాల్సిన పరిస్థితి రావడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ అధికారులు తక్షణం స్పందించి సమయానికి బస్సులు నడపడంతో పాటు బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు బన్నీ, సాత్విక్, సిద్ధు, సాయి, సురేశ్, ఆకాశ్, నిర్మల, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ముగిసిన ఎస్జీఎఫ్ క్రీడలు


ఎస్జీఎఫ్ క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎంఈవో, పీడీలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 21 : సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్)ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి క్రీడలు శనివారం ముగిశాయి. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసి, ఎంఈవో వెంకట నర్సింహులు చేతుల మీదుగా మెమొంటోలను అందజేశారు.

28న జిల్లా స్థాయి క్రీడోత్సవాలు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 21: ఈ నెల 28న జిల్లాస్థాయి క్రీడోత్సవాలను స్థానిక ఇందిరాగాంధీ, పీఎన్ఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేగోడు సెప్టెంబరు 21: రేగోడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని రేగోడు విద్యుత్ ఏఈ యాసిన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రేగోడుతో పాటు కొత్వాల్‌పల్లి, మర్పల్లి, జగిర్యాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● శివ్వంపేట: విద్యుత్ మరమ్మతులు, 33 కేవీ లైన్ షిఫ్టింగ్ కారణంగా మండల పరిధిలోని చిన్న గొట్టిముక్ల, పెద్ద గొట్టిముక్ల, చెన్నాపూర్, తిమ్మాపూర్ గ్రామాలకు ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఇన్‌చార్జి ఏఈ సాయికుమార్ శనివారం తెలిపారు.

ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితవైద్యం: ఖేడ్ ఎమ్మెల్యే


ఖేడ్ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబు 21: రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు ఉన్న ఉచిత వైద్యాన్ని రూ.10 లక్షలకు పెంచి పేదలకు ఉచిత వైద్యం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఖేడ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖేడ్, మనూరు, నాగల్‌గిద్ద, మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, బోజిరెడ్డి, తాహెర్‌అలీ, పండరిరెడ్డి, దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాధాకిషన్, గోస్‌చిస్తీ, షాదుల్‌చిస్తీ తదితరులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన మెదక్ జిల్లా ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి

జేఏసీ చైర్మన్‌గా దొంత నరేందర్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 21: మెదక్ జిల్లా ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్‌గా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఎన్నికయ్యారు. శనివారం రాత్రి స్థానిక సంఘభవన్‌లో ఉద్యోగులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో నరేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్టీరింగ్ కమిటీ సభ్యులుగా టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, ట్రెస్మా జిల్లా అధ్యక్షుడు మహేందర్‌గౌడ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సజ్జని శ్రీనివాస్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్, యూటీఎఫ్ అధ్యక్షుడు పద్మారావు, టీఆర్‌టీఎఫ్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, తపస్ అధ్యక్షుడు ఎల్లం, టీపీటీఎఫ్ అధ్యక్షుడు సంగయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జగదీష్ చంద్ర, టీజీవో బాధ్యుల వేణుకుమార్‌తోపాటు అశోక్, శివయ్య, జయకర్ ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

మెదక్ అర్బన్, సెప్టెంబరు 21: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మెదక్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో శుక్రవారం అండర్-14,16,18,20 బాలబాలికలకు 10వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. జావెలిన్‌త్రోలో శ్రీకాంత్(గోల్డ్), హైజంప్‌లో సోము(సిల్వర్), స్టీపుల్ చేంజ్‌లో దీపిక(సిల్వర్), 110 మీటర్ల హార్డిల్స్‌లో కిషోర్(సిల్వర్), 80 మీటర్స్ హార్డిల్స్‌లో జగ్జీవన్(సిల్వర్) మెడల్స్ సాధించారు. అండర్-16 విభాగంలో జిల్లా చాంపియన్ షిప్ కైవసం చేసుకుందన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు చక్కగా బోధించాలి: డీఈవో

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 21: కేజీబీవీ విద్యార్థినులకు చక్కటి బోధన అందించాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. సంగారెడ్డిలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో జిల్లాలోని వివిధ కేజీబీవీల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎంపికైన 51 మంది అభ్యర్థులకు శనివారం ఆయన నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఎంవో వెంకటేశం, విద్యాశాఖ అధికారులు, అభ్యర్థులు ఉన్నారు.

పలు కళాశాలల్లో ఘనంగా ఫ్రెషర్స్ డే


ఫ్రెషర్స్ డేలో సెయింట్ ఆంథోనీస్ యాజమాన్యం, విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 21: సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ డిగ్రీ కళాశాలలో శనివారం నెక్స్‌జెన్ నొ వాయిసెస్ పేరుతో ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా గత సెమిస్టర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. విద్యాసంస్థల అధినేత ఈదర సల్మోన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ జయ బాలరెడ్డి, డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ అరుణరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జవహర్ పాల్గొన్నారు.

● పాపన్నపేట: పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే సాధన వల్లే సాధ్యపడుతుందని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో ఎంసెట్ క్లాసులు కూడా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెకండ్ ఇయర్ విద్యార్థులు, ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఇచ్చిన పార్టీలో ఆటలు, పాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన మార్డి ఐకేపీ సీసీపై విచారణ


మార్డిలో సీసీపై బహిరంగ విచారణ జరుపుతున్నఅధికారులు

కల్హేర్, సెప్టెంబరు 2: ఐకేపీ మార్డి క్లస్టర్ కమ్యూనిటీ కోఆర్డినేటర్(సీసీ)పై వచ్చిన అవినీతి ఆరోపణల ఫిర్యాదుపై శనివారం డీఆర్డీఏ జిల్లా అధికారులు బహిరంగ విచారణ జరిపారు. మార్డి క్లస్టర్ సీసీ అరుణ పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించేందుకు వారి నుంచి డబ్బులు తీసుకుంటుందని, అంతేకాకుండా ధాన్యం, జొన్నల కొనుగోలు కేంద్రాల్లో కూడా రైతుల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తూ డబ్బు ఇచ్చిన రైతుల ధాన్యం, జొన్నలను మొదట తూకం వేస్తుందని పేర్కొంటూ మార్డి గ్రామానికి చెందిన పొదుపు సంఘాల మహిళలు, రైతులు డీఆర్డీఏ పీడీకి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీఆర్డీఏ డీపీఎం(ఫైనాన్స్) కొమురయ్య, ఏపీ సీసీ రామక్రిష్ణ మార్డికి చేరుకుని పొదుపు సంఘాల మహిళలు, రైతుల సమక్షంలో బహిరంగ విచారణ జరిపారు. సీసీ అరుణ తమ వద్ద డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందని, డబ్బులు ఇవ్వకుంటే రుణాల రెన్యూవల్‌లో తీవ్ర జాప్యం చేస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తుందని పొదుపు సంఘాల మహిళలు విచారణ అధికారులకు తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధాన్యం, జొన్నల కొనుగోళ్ల కేంద్రాల్లో కూడా చేతి వాటం ప్రదర్శించిన సీసీపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. కాగా విచారణ జరిపిన అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉండగా సీసీని సముదాయించి గ్రామస్తులతో కలిసి పని చేసుకోవాలని సూచించడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెను తొలిగించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడికి కాళోజీ పురస్కారం


సూర్యప్రకాష్

నర్సాపూర్, సెప్టెంబరు 21: తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఏటా అందించే కాళోజీ పురస్కారానికి నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు, కవి సూర్యప్రకాష్ ఎంపికయ్యారు. ఈ నెల 22న మహబూబ్‌నగర్‌లోని భారత్ స్కౌట్స్ భవనంలో జరిగే సభలో ఈ పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు

నిజాంపేట, సెప్టెంబరు 21: విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మారెడ్డి పేర్కొన్నారు. రాంపూర్ గ్రామంలో శనివారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రతి రోజు పిల్లలను శుభ్రంగా తయారుచేసి పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌస్ తదితరులు హాజరయ్యారు.

● మెదక్ కల్చరల్: మెదక్ మండలంలోని రాజ్‌పల్లి గ్రామంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషకుల, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిల్లల ప్రగతి హాజరు శాతం, వసతులు, చర్చించారు. విద్యార్థుల అభివృద్ధికి పాఠశాలలో ఉపాధ్యాయులు అవలంబిస్తున్న బోధనా పద్ధతులను తల్లిదండ్రులకు వివరించారు కార్యక్రమంలో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●చిన్నశంకరంపేట: పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను కోరారు. శనివారం చిన్నశంకరంపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ దీప్లా నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పేరెంట్స్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో విద్యాభ్యాసంపై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి: పీఆర్టీయూ


రేగోడు మోడల్ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

రేగోడు సెప్టెంబరు 21: ఉద్యోగరీత్యా బదిలీలు సహజమే అని, చేసిన సేవలు మాత్రం గుర్తింపునిస్తాయని పీఆర్టీయూ రేగోడు మండల అధ్యక్షుడు అంజిబాబు పేర్కొన్నారు. శనివారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానం చేశారు. రేగోడు మోడల్ పాఠశాలలో 11 సంవత్సరాలుగా విద్యార్థులకు పాఠాలు నేర్పడంతో పాటు వారి భవిష్యత్తుకు దారి చూపిన ఉపాధ్యాయుల గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసంబద్ధమైన టీచర్ల సర్దుబాటు సరికాదు: తపస్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 21 : విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్ల సర్దుబాటు చేయాలంటూ విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని టీపీయూఎస్(తపస్) అధ్యక్ష, కార్యదర్శులు దత్త్రాత్రి, అడివప్ప శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అసంబద్ధమైన ఉత్తర్వులను తపస్ ఖండిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్నదని, నిర్ణీత సమయంలో నిర్దేశించిన విద్యాప్రమాణాలను, సామర్థ్యాలను విద్యార్థులకు కల్పించడం అత్యంత కఠినంగా మారిందన్నారు. ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు, లేదా ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నపుడు మాత్రమే సరైన విధంగా బోధన జరుగుతుందన్నారు.

● చేగుంట: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్య ఆధారంగా అసంబద్ధమైన సర్దుబాటు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని తపస్ మెదక్ జిల్లా ప్రధానకార్యదర్శి చల్లా లక్ష్మణ్ పేర్కొన్నారు. చేగుంట మండల వనరుల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన ప్రభుత్వంలో కొంతమైన సమస్యలకు ఉపశమనం కల్గుతుందని భావించామని, తిరిగి సర్దుబాటు వల్ల సమస్య తీవ్రమవుతుందన్నారు.

టీజీపీఎస్సీ ఫలితాల్లో
నాగల్‌గిద్ద ఉపాధ్యాయుడికి ఫస్ట్ ర్యాంక్


జి.దత్తు

నాగల్‌గిద్ద, సెప్టెంబరు 21: టీజీపీఎస్సీ ఇటీవల నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జి.దత్తు చార్మినార్ జోన్‌లో మొదటి ర్యాంకు సాధించాడు. మారుమూల గ్రామం నుంచి మొదటి స్థానం సంపాదించడం పట్ల గ్రామస్తులు దత్తుని ప్రశంసించారు.

గురుకుల కళాశాల పీఈటీకి డాక్టరేట్

మునిపల్లి, సెప్టెంబరు 21: మండలంలోని బుదేరా చౌరస్తాలో గల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి. రమాదేవికి డాక్టరేట్ పట్టా దక్కింది. ఈ సందర్భంగా 'ఎఫెక్ట్ అఫ్ ఎనరోబిక్ ట్రైనింగ్ అండ్ సర్క్యూట్ అఫ్ ఫిజికల్ ఫిట్నెస్ సైకాలజికల్ అండ్ పర్ఫార్మెన్స్ అబిలిటీస్ అమాంగ్ జిమ్నాస్టిక్ అఫ్ తెలంగా స్టేట్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ నెల 13న డాక్టరేట్‌ను ప్రకటించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన ఆచార్య కెడి దీప్ల పర్యవేక్షణలో పరిశోధన చేసి డాక్టరేట్‌ను అందజేశారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి: గోదావరి అంజిరెడ్డి


రేగోడులో బీజేపీ సభ్యత్వం చేయిస్తున్న బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి

వట్‌పల్లి/రేగోడు, సెప్టెంబరు 21: రానున్న స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వట్‌పల్లిలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పార్టీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, అందోల్ అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా రేగోడులో చేపట్టిన బీజేపీ సభ్యత్వనమోదు కార్యక్రమంలో గోదావరిఅంజిరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడి మృతి ఘటనలో... పరిహారం కోసం కుటుంబీకుల ధర్నా


ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబీకులు, తోటి కార్మికులు

జోగిపేట, సెప్టెంబరు 21: విధి నిర్వహణలో విద్యుదాఘాతంతో మృతి చెందిన పంచాయతీ కార్మికుడి కుటుంబానికి పరిహారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మృతుడి కుటుంబీకులు, తోటి కార్మికులు ధర్నా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని తాలెల్మ పంచాయతీలో కార్మికుడిగా పని చేస్తున్న మన్నె లక్ష్మయ్య (45) వీధి దీపాలు బిగిస్తుండగా, విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన విషయం తెలిసిందే. విధి నిర్వహణలో మృతి చెందినందున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలంటూ.. మృతుడి భార్య, తోటి పంచాయతీ కార్మికులు కలిసి జోగిపేటలోని ఏరియా ఎదుట ధర్నాకు దిగారు. వీరికి సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ సంఘీభావం ప్రకటించారు. మండల ప్రత్యేకాధికారి, మెప్మా పీడీ గీత, ఎంపీడీవో రాజేశ్, ఇన్‌చార్జి ఎంపీవో పట్లో అశోక్ ధర్నా స్థలానికి చేరుకున్నారు. విధి నిర్వహణలో మృతిచెందినందున ట్రాన్స్‌కో తరఫున రూ. 5 లక్షలు, ప్రభుత్వం ద్వారా మరో రూ. 2 లక్షలు చెల్లించాలంటూ మృతుడి కుటుంబీకులు డిమాండ్ చేస్తూ ధర్నా కొనసాగించారు. చివరకు ప్రత్యేకాధికారి గీత, ఎంపీడీవో రాజేశ్, ఎంపీవో అశోక్‌లు ట్రాన్స్ కో అధికారులతో మాట్లాడి, పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తరువాత రూ. 5 లక్షల వరకు పరిహారం చెల్లించేలా ఒప్పించారు. ఈ మేరకు ఒప్పంద లేఖను మృతుడి భార్యకు అందజేయడంతో ధర్నాను విరమించారు.

రేగోడులో తాగునీటి కోసం నిరసన

రేగోడు సెప్టెంబరు 21:తాగునీటి కోసం అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని రేగోడు వీరబ్రహ్మేంద్ర కాలనీవాసులు శనివారం ఖాళీ బిందెలతో నిరసన చేశారు. రేగోడు శ్రీ వీరబ్రహ్మేంద్ర కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉన్నా, నెల రోజులుగా నీటి సరఫరా జరగడంలేదని వాపోయారు. దాదాపు 50 ఇళ్లకు తాగునీటి సరఫరా లేదని, పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. భగీరథ నీటిని సరఫరా చేయాలని కోరారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి
సీఎంకు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి లేఖ

మెదక్ అర్బన్/ పాపన్నపేట, సెప్టెంబరు 21: కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగా లేఖ రాసినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాఫీ చేయలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ. 4500 కోట్ల ఫీజు బకాయిలు ఉన్నాయని చెప్పారు. ఇవి చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు.

మండలాల్లో ముమ్మరంగా 'స్వచ్ఛతా హీ సేవా'


నర్సాపూర్ అర్బన్‌పార్కులో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్మన్

కంది, సెప్టెంబరు 21: కంది పరిధిలోని ఎద్దుమైలారం వద్ద ఉన్న మెదక్ ఆయుధ కర్మాగారం మేనేజర్లు శనివారం ఎద్దుమైలారం గ్రామంలో స్వచ్ఛతాహి సేవలో పాల్గొన్నారు. ఆ గ్రామ మాజీ సర్పంచ్ కాసాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో వారు ప్రభుత్వ అధికారులు, పారిశుధ్య కార్మికులతో కలిసి ఎద్దుమైలారంలోని ఉన్నత పాఠశాల ఆవరణ, గ్రామంలోని పరిసరాలు మొత్తం చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. అలాగే గ్రామంలోని ఇళ్ల మధ్యలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం పాఠశాలలో, గ్రామంలోని వీధుల్లో రోడ్లకిరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసాల మల్లారెడ్డి, ఆయుధ కర్మాగారం మేనేజర్లు విజయదత్, బాబ్జీ, అమిత్, రాందాస్, రవిసింగ్, చౌదరికుమార్, మోహన్, ఎంపీడీవో శ్రీనివాస్, ప్రత్యేక అధికారి మహేందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● జిన్నారం: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మానవహారం నిర్వహించారు. శనివారం బొల్లారం మున్సిపాలిటీలో మున్సిపల్ అధికారులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, 1, 19 వ వార్డుల్లో స్వచ్ఛతపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు మానవహారంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు చంద్రయ్య, సంధ్య మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

● కల్హేర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ కళాశాల విద్యార్థులతో కలిసి అధ్యాపకులు, అధికారులు కల్హేర్‌లో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కల్హేర్ బస్టాండ్ కూడలిలో విద్యార్థులు మానవహారం నిర్వహించి స్వచ్ఛత నిర్వహణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ బాబు, కార్యదర్శి క్రిష్ణచారి, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాజేశ్‌గౌడ్, ఈజీఎస్ ఏపీవో రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

● జహీరాబాద్: విద్యార్థుల్లో సంస్కార స్వచ్ఛత అత్యవసరమని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు శైలజ, హేమలత, సాయి ప్రియాంకలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని బూచనెల్లి శివారులోని మైనారిటీ గురుకుల పాఠశాలల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 'స్వభావ స్వచ్ఛత-సంస్కార స్వచ్ఛత' అంశంపై చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ప్రతిభను కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రుబీనాబేగం, బోధనసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కల్హేర్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

● నారాయణఖేడ్: ఖేడ్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 1కే మారథాన్ రన్ నిర్వహించారు. స్థానిక తహసీల్ గ్రౌండ్ నుంచి పట్టణంలోని రాజీవ్ చౌక్ వరకు రన్ కొనసాగింది. అనంతరం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ యువతకు స్వచ్ఛత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్, సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

● నర్సాపూర్, సెప్టెంబరు 21: ప్లాస్టిక్ వాడకం తగ్గించుకోవాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దచింతకుంట సమీపంలో గల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ సమీపంలోని అర్బన్‌పార్కు వద్ద జాతీయ రహదారి ఇరుప్రక్కల ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు. అనంతరం అర్బన్‌పార్కులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కమిషనర్ రామకృష్ణరావులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దామోదర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సురేష్, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, కాలేజీ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.